# 15 ఏండ్లలో 23 వేల టీచర్ పోస్టుల భర్తీ

- దశలవారీగా ఉపాధ్యాయ నియామకాలు
- రిటైర్మెంట్‌తో 44 వేల పోస్టులు ఖాళీ
- బోధనా విద్య కళాశాలల ప్రక్షాళనపై ఫోకస్
- పాఠశాల విద్యాశాఖ దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాణ్యమైన విద్యావిధానం అందుబాటులోకి తేవడానికి పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. వచ్చే 15 ఏండ్ల (2030 నాటికి)లో సుమారు 44 వేల మంది టీచర్ల రిటైర్మెంట్‌తో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీ అవుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ అధికారులు అంచనావేస్తున్నారు. భవిష్యత్‌లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ అవసరాలకు అనుగుణంగా దశలవారీగా 23 వేల టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లలో 70 శాతం పదోన్నతుల ద్వారా, మిగతా 30 శాతం ప్రత్యక్ష నియామకాల ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని యోచిస్తున్నారు. 15 ఏండ్ల అవసరాలకు అనుగుణంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ చెప్పారు.

**ఇబ్బడిముబ్బడిగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు**

రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా ఆవిర్భవించిన బీఎడ్, డీఎడ్ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు సుమారు 6.5 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. బీఎడ్ పూర్తయిన వారు నాలుగు లక్షలు, డీఎడ్ పూర్తిచేసిన వారు 2.5 లక్షల మంది ఉంటారని అధికారుల అంచనా. కానీ వీరిలో టెట్ అర్హత సాధించిన వారు 25-40 శాతం లోపేనని పేర్కొన్నారు. దీన్నిబట్టి ప్రైవేట్ బీఎడ్, డీఎడ్ కళాశాలల్లో విద్యాబోధన నాసిరకంగా ఉన్నదని భావిస్తున్న విద్యాశాఖ.. వాటిని భారీస్థాయిలో తగ్గించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. త్వరలో డీఈఈసెట్ నిర్వహించనున్న నేపథ్యంలో డీఎడ్ కాలేజీల పటిష్టతకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామంటున్నారు. ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించిన కళాశాలలకు మాత్రమే ఈ దఫా అఫిలియేషన్లు ఇస్తామని, ఈ విషయమై ఎక్కడా రాజీ పడే ప్రసక్తి లేదంటున్నారు. బోధనా విద్య కళాశాల ప్రక్షాళన దిశగా చర్యలు చేపడుతామన్నారు. భవిష్యత్‌లో జననాల రేటు తగ్గుదలకు అనుగుణంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఉంటుందని చెప్తున్నారు.